ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

నల్లగొండ fb.com/vaartha

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

27-10-2024 ఆదివారం సంపుటి: 30 సంచిక: 269 పేజీలు: 8+16 వెల: 8.00

దుండిగల్‌లో భూ సర్వేను అడ్డుకున్న రైతులు 3

మహారాష్ట్రలో పోటీకి ఆప్ దూరం 5

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



శనివారం హైదరాబాద్‌లో కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరిస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి పొన్నం

## దీపావళి కానుకలు ప్రకటించిన ప్రభుత్వం

### సర్కారీ ఉద్యోగులకు ఒక డిఎ చెల్లింపు
### పూడిక తీసేందుకు పైలట్ ప్రాజెక్టుగా కడియం
### 76 కి.మీ. మెట్రో రైల్ విస్తరణకు కేబినెట్ ఆమోదం
### కేటగిరీలవారీగా మిల్లర్లకు ధాన్యం అందజేత
### ఐదున్నర గంటల పాటు సాగిన కేబినెట్ భేటీ
### వివరాలు తెలిపిన మంత్రులు పొంగులేటి, పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో పేదలకు, ఉద్యోగులకు దీపావళి కానుకలను ప్రకటించింది. శనివారం సాయంత్రం ఐదున్నర గంటల పాటు జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశానికి మంత్రులు,అధికారులందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ మీడియాకు వివరించారు. దీపావళి కానుకగా పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలి పింది. ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇళ్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. దీపావళి పండుగ మరుసటి రోజు నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. లబ్దిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత ఉండాలని, పార్టీలకు అతీతంగా బహు పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని కేబినెట్ సూచించింది. 2022 జనవరి నుంచి >>2

# గిలి..గిలి చలి..చలి!



### రాష్ట్రంలో మారిన వాతావరణం
### వేడినుంచి ఎట్టకేలకు ఉపశమనం
### రాత్రి వేళ 20 డిగ్రీల దిగువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
### ముందుముందు మరింతగా చలిగాలులు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో చలి కాలం మొదలయ్యింది. మూడు రోజుల క్రితం వరకు ఉత్తరాది రాష్ట్రాల నుంచి వీచిన వేడి గా లులతో పాటు వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రంలో పగటి పూట ఎండ వేడిమి 33 డిగ్రీలను మించడం తెలిసిందే. కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల వరకు కూడా నమోదయ్యాయి. ఇదే సమయంలో ఉక్కపోత ఎక్కువగా వుండడంతో ప్రజలు వేడి వాతావరణంలో అల్లాడి పోయారు. ఒక రకంగా చెప్పాలంటే చలి కాలంలో వేసవి వాతావరణంలా వుండేది. అయితే ఈ ఏడాది చలి కాలం కాస్త ఆలస్యంగా ప్రవేశించిందని చెప్పాలి. సాధారణంగా దసరా పండగ తరువాత అంటే అక్టోబర్ మొదటి వారంలోనే రాష్ట్రంలో చలికాలం మొదలవడం >>2

# మాకు న్యాయం చేయండి..

### బెటాలియన్ కానిస్టేబుళ్ల ప్రత్యక్ష ఆందోళన
### మామునూర్ వద్ద యూనిఫాంతోనే నిరసన
### మరికొన్ని చోట్ల కుటుంబ సభ్యుల ఆందోళన
### 'ఏక్ స్టేట్- ఏక్ పోలీస్' విధానం అమలు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్



నల్లగొండలో ఆందోళన చేస్తున్న బెటాలియన్ పోలీసుల భార్యలను తరలిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణ స్పెషల్ పోలీసు బెటాలియన్లలో వారం రోజులకుపైగా కానిస్టేబుళ్లు ఇతర సిబ్బంది చేస్తున్న ఆందోళన మరింత ఉధృత మయ్యింది. ఇప్పటి వరకు కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది కుటుంబీకులు ఆందోళన చేయగా శనివారం నాడు వరంగల్ జిల్లా మామనూర్ నాలుగవ బెటాలియన్ వద్ద కానిస్టేబుళ్లు యూనిఫాం ధరించి నిరసనకు దిగారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమ కుటుంబీకులు, ఆడపడుచులతో నల్లగొండ జిల్లా అన్నెపర్తి వద్ద ఒక సివిల్ ఎస్ఐ అమర్యాదగా మాట్లాడడంపై వారు ఆందోళనకు దిగడంతో కొద్దిసేపు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. స్థానిక కమాండంట్ కార్యాలయం వద్ద కానిస్టేబుళ్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బైటాయించారు. తమ డిమాండ్ల సాధనకు శాంతియుతంగానే తాము ఆందోళన చేస్తున్నామని, ఈ విషయంలో ఎవరి ఒత్తిడి లేదని, తమ వెనుక ఎలాంటి రాజకీయ శక్తులు లేవని ఆందోళన చేబట్టిన సిబ్బంది తెలిపారు. కాగా ఆందోళన చేసిన వారితో కమాండంట్ సహా ఇతర అధికారులు మాట్లాడి వారి సమస్యలను వినడంతో పాటు వీటిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల హామీ మేరకు జవాన్లు తమ ఆందోళనను విరమించారు. కాగా మామనూర్‌తో పాటు అన్నెపర్తి బెటాలియన్ వద్ద కూడా కొందరు ఆందోళన చేబట్టారు. ఇక్కడ బందోబస్తు కోసం వచ్చిన సివిల్ ఎస్ఐ ఒకరు ఆందోళన చేసిన మ హిళల పట్ల అమర్యాదకరంగా >>2

డిజిపి సిరియస్
కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిక 3



హైదరాబాద్‌లోని బాలసదన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో విల్లు ఎక్కుపెట్టిన మంత్రి సీతక్క

చట్టబద్ధత లేని భారతీయులను వెనక్కి పంపిన అమెరికా 5

# 'పొంగులేటి బాంబ్' ఏమిటో!

### నేను ఎదురుచూస్తున్నా..
### కేబినెట్ విస్తరణ హైకమాండ్, సిఎం చేతుల్లోనే..
### బాధతోనే జీవన్‌రెడ్డి లేఖ, ఆయనకు అండగా ఉంటాం
### త్వరలోనే కాంగ్రెస్‌లోకి మరిన్ని చేరికలు
### ఢిల్లీలో మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చిట్‌చాట్



ఢిల్లీలో శనివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిన కేబినెట్ విస్తరణపై టిపిసిసి చీఫ్,ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన శనివారం మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. మంత్రివర్గ విస్తరణ ఎఐసిసి,ముఖ్యమంత్రి కన్ను సన్నలలో జరుగుతుందని, నేను పార్టీ వ్యవహారాలు మాత్రమే చూస్తున్నానని అన్నారు. కేబినెట్ విస్తరణ పార్టీ హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టంచేశారు. త్వరలో పిసిసి నూతన కార్యవర్గ నియామకం ఉంటుందని, డీసీసీలుగా ఎమ్మెల్యేలతో పాటు సమర్థులకు కార్యవర్గంలో స్థానం ఉంటుందన్నారు. ఇతర పార్టీల నాయకుల చేరికలతో కొన్ని సమస్యలు తలెత్తాయని పాత కొత్త నేతలను సమన్వయం చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి సన్నిహితుడు మరణంతో మనస్థాపానికి లోనయ్యారని, బాధతో ఆయన లేఖ రాశారన్నారు. జీవన్‌రెడ్డి పార్టీలో సీనియర్ నాయకుడని, ఆయనకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం డిజైన్ మార్చి వ్యయం పెంచారని ఆరోపించారు. కమీషన్ల కోసం కాళేశ్వరం కట్టారని, ప్రజాధనం దుర్వినియోగం చేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై కమిషన్ విచారణ జరుపుతోందని,కాళేశ్వరం వాస్తవాలు బయటకు రావాలని అన్నారు. అన్యాయంగా ప్రభుత్వం ఎవరిపైన కేసులు పెట్టదని, అదే విధంగా తప్పు చేసిన ఎవరినీ వదలదని హెచ్చరించారు. రాష్ట్రంలో పొలిటికల్ బాంబు పేలుతాయంటూ మంత్రి పొంగులేటి చేసిన కామెంట్స్ స్పందిస్తూ... గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారి గురించే పొంగులేటి మాట్లాడారని భావిస్తున్నానని అన్నారు. పొంగులేటి పేల్చబోయే బాంబుల కోసం తాను ఎదురుచూస్తున్నట్లు ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్కినేని ఫ్యామిలీ,సమంతపై కొండ సురేఖ మాటలను పార్టీ సమర్థించ లేదని, వెంటనే కొండా సురేఖ తన మాటలు ఉపసంహరించుకున్నారని గుర్తు చేశారు. రానున్న డిసెంబర్‌లో కొన్ని శుభవార్తలు వింటారని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మరోవైపు 2029 ఎన్నికలు మాకు ఫైనల్ అని, రాష్ట్రం, >>2

# వెయ్యి కోట్ల 'కరెంటు' షాక్!




### స్థిరఛార్జి రూ.10 నుండి రూ.50 కి పెంపు!
### రూ.70 నుండి 150కి చేరనున్న ఎల్‌టి చార్జి
### హెచ్‌టి కనెక్షన్లు యూనిట్‌కు రూ.1 పెంపు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** తెలంగాణలో త్వరలో కరెంట్ చార్జీలు మోత మోగనున్నాయి. రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు సవరించాలని పంపిణీ సంస్థలు ప్రతిపాదించాయి. ఇందువల్ల వివిధ కేటగిరీలకు చెందిన వినియోగదారులపై దాదాపు 1,000 కోట్ల రూపాయల మేర భారం పడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గృహోపయోగ కనెక్షన్లకు నెలకు 300 యూనిట్లు దాటి ఎక్కువ యూనిట్లు కరెంటు వాడితే స్థిర ఛార్జిని 10 రూపాయల నుండి 50 రూపాయలకు పెంచాలని నిర్ణయించాయి. ఇందువల్ల అదనంగా సుమారు 328 కోట్ల రూపాయల మేర ఆదాయం వస్తుందని అంచనా వేశాయి. అలాగూ హైటెన్షన్ వినియోగదారులకు 11 కెవీ కనెక్షన్ స్థాయిలోనే 33 కెవీ, 132 కెవీ కనెక్షన్లకు విద్యుత్ చార్జీలను పెంచి వసూలు చేయనున్నట్లు తెలిపాయి. ఈ ప్రతిపాదలనపై ఇప్పటికే తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ విచారణను కూడా పూర్తి చేసింది. ఈ నేపధ్యంలో ఇతర రాష్ట్రాలతో కరెంటు >>2



శనివారం సిఎం రేవంత్ సమక్షంలో ఎంఒయు మార్చుకొంటున్న మెఘా సంస్థ ప్రతినిధులు. చిత్రంలో డి.సిఎం భట్టి, పలువురు మంత్రులు

## స్కిల్ వర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి
# రూ. 200 కోట్లు
## విరాళంగా ఇచ్చిన 'మెఘా'

### సిఎం రేవంత్ సమక్షంలో కుదుర్చుకున్న ఎంఒయు
### నవంబరు 8 నుంచి నిర్మాణం పనులు ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు26:** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. స్కిల్ యూనివర్సిటీ భవన నిర్మాణానికి మెఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఫౌండేషన్ ముందుకొచ్చింది. మొత్తం యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి మెఘా కంపెనీ తమ కార్పొరేట్ షోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి రూ.200 కోట్లు కేటాయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రభుత్వం తరఫున స్కిల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎల్‌విఎస్ఎస్ సుబ్బారావు,ఎంఈఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ కృష్ణారెడ్డి శనివారం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను స్వీకరించింది. ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతులు ఉండేలా స్కిల్క్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు కంపెనీ ముందుకు వచ్చింది. ఈసందర్భంగా ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు,ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. కందుకూరు మండలంలో మీర్ ఖాన్‌పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టులోనే యూనివర్సిటీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అక్కడ ఆధునాతన బోధన సదుపాయాలతో పాటు విద్యార్థులకు అన్ని >>2

# లెక్చరర్లే స్వీపర్లు స్టూడెంట్లే అటెండర్లు!



ఇదీ రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల దుస్థితి

### గంటకొట్టే పని ప్రిన్సిపల్‌దే
### బాలికలకు బాత్రూంలు సైతం లేవు
### శుభ్రత కరవైన కాలేజి గదులు
### కనీస సౌకర్యాలు లేని 80% కళాశాలలు
### ప్రభుత్వ కాలేజీలకు వెలల్లో.. ప్రైవేటుకు లక్షల్లో చేరుతున్న విద్యార్థులు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కనీస సౌకర్యాలు, సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. చివరికి కొన్ని కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ క్లాసులను చెప్పడానికి లెక్చరర్లు కూడా లేరు. దీంతో రాష్ట్రంలో పూర్తిగా ఉచిత విద్యను అందిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరకుండా.. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో చేరుతున్నారు విద్యార్థులు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే తల్లిదండ్రులు తమ పిల్లలను తమకు దగ్గరలో ఉండే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేర్పించాలని భావిస్తున్నప్పటికీ.. వాటిలో విద్యార్థులకు సరిపడా >>2

# బెటాలియన్ల సిబ్బంది ఆందోళనపై డిజిపి సీరియస్

### ఆందోళనకారులపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్పెషల్ పోలీసు బెటాలియన్ల కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది చేస్తున్న ఆందోళనపై డిజిపి జితేందర్ తీవ్రంగా పరిగ ణించారు. ఈ మేరకు శనివారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ క్రమశిక్షణ కలిగిన పోలీసు శాఖలో వుంటూ ఇలాంటి ఆందోళనలు చేయడం సరైంది కాద ని బెటాలియన్ల కానిస్టేబుళ్లను ఆయన హెచ్చరించారు. సమస్యలను చర్చించేందుకు హామీ ఇవ్వడంతో పాటు సెలవులపై పాత పద్దతిని అమలు చేస్తామని చెప్పినప్పటికీ ఇంకా ఆందోళనలు చేయడంపై కఠినంగా వ్యవహరిస్తామని, ఆందోళనకారులపై చర్యలు తీసుకుంటామని డిజిపి హెచ్చరించారు. ఈ ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతి రేక శక్తులు వున్నాయని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. పండగలు, సెలవుల సమయంలో కూడా పోలీసులు నిర్వహించే కఠిన విధులను దృష్టిలో వుంచుకుని ఇత ర ప్రభుత్వ విభాగాలకు ఈ ప్రయోజనం వర్తించదని అయితే తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగం సిబ్బంది ప్రత్యేక పరిస్థితులల్లో పనిచేస్తున్నందున ఈ వెలుసుబాటును ఇచ్చినట్లు డిజిపి తెలిపారు. ఇతర రాష్ట్రాల పోలీసులతో పోలిస్తే తెలంగాణ పోలీసులకు జీతాలతో పాటు అలవెన్సులు అధికంగా వున్నాయని, పోలీసు శాఖ భద్రత, ఆ రోగ్య భద్రత వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని డిజిపి జితేందర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ స్పెషల్ పోలీసు సిబ్బంది విధులను విస్మరించి ఆందోళనలు, ధర్నాలు చేయడం ఎంతమాత్రం సరైంది కాదని ఆయన హితవు పలికారు. తెలంగాణ స్పెషల్ పోలీసు విభాగం యూనిఫాం, క్రమశిక్షణ కలిగిన బలమైన దళమని ఇటువంటి దళంలో పనిచేస్తున్న పోలీసులు ఆందోళనల పేరిట రోడ్డెక్కడం సబబు కాదని ఆయన తెలిపారు.

# డిఎస్సీ-2024 ఉపాధ్యాయులకు అక్టోబర్ 10 నుంచే వేతనాలు

### ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్య డైరెక్టర్

### జిల్లాల్లో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని డిఇఒలకు ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన కొత్త ఉపాధ్యాయులకి అక్టోబర్ 10 నుంచే వేతనాలను చెల్లించనున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్య డైరక్టర్ ఈవీ నరసింహారెడ్డి శనివారం జారీ చేశారు. రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టులకి ప్రభుత్వం డీఎస్సీ-2024 జారీ చేయగా.. వాటిలో పరీక్షల నిర్వహణ అనంతరం.. మెరిట్ జాబితా మేరకు కోర్టుల కేసుల నేపథ్యంలో 11,062 పోస్టుల్లో 10,006 ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. వారికి ఈ నెల 9న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాలను అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారు ఈ నెల 10, 11 తేదిల్లో డీఈవో ఆఫీసుల్లో రిపోర్ట్ చేశారు. వారికి ఈ నెల 15న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టులను ఇచ్చారు.. వారు ఈ నెల 16న పాఠశాలల్లో చేరారు. అయితే డీఎస్సీ-2024లో నియామకం పొందిన ఉపాధ్యాయులకి వేతనాలను అక్టోబర్ 10 నుంచి చెల్లిస్తారా? లేకపోతే వారు స్కూల్‌లో జాయిన్ అయిన తేది నుంచి చెల్లిస్తారా? స్పష్టత ఇవ్వాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు పాఠశాల విద్య డైరక్టర్‌కి వినతిపత్రం సమర్పించాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీ-2024 ద్వారా నియమితులై క్లియర్ వెకెన్సీలు ఉన్న పాఠశాలల్లో చేరిన వారికి అక్టోబర్ 10 నుంచే వేతనాలను చెల్లించాలని.. జిల్లాల్లోని ఎంఈవోలందరూ ఇదే నిర్ణయాన్ని అమలు చేసేలా డీఈవోలు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్య డైరక్టర్ ఆదేశాలు జారీ చేశారు.




# బిజెపి సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఎండల లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** బిజెపి సంస్థాగత ఎన్నికల రాష్ట్ర రిటర్నింగ్ అధికారిగా మాజీ శాసనసభపక్ష నేత ఎండల లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరించారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యాలయాన్ని ప్రారంభించాక బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్య దర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, సహరిటర్నింగ్ అధికారి కరుణాకర్, సీనియర్ నేతలు గీతామూర్తి, డా. ఉమాశంకర్, కెవి.ఎస్‌రాజు, మురళీధర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# డెలివరీబాయ్ పేరిట సైబర్ నేరగాళ్ల టోకరా

### ప్రజలకు టి.పోలీసు విభాగం హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు నిత్యం ఏదో ఒకచోట అమాయకుల నుంచి సంపన్నుల వరకు టోకరా వేస్తూ అందినంత దండుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్లు కొత్తగా డెలివరి బాయ్ పేరిట చేబట్టిన నేరంపై తెలంగాణ పోలీసులు ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ పెడుతూ ప్రజలను హెచ్చరించారు. మీరు ఆర్డర్ చేయకుండానే మీకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ వచ్చిందని డెలివరి బాయ్ పేరిట ఏదైనా ఫోన్ వస్తే అది కచ్చితంగా సైబర్ నేర గాళ్ల ఫోన్‌గా భావించాలని పోలీసులు చెబుతున్నారు. డెలివరి వచ్చింది, ఓటిపి చెప్పాలని ఎవరైనా ఫోన్ చేస్తే వెనుకా ముందు చూడకుండా చెప్పవద్దని పోలీసులు కో రసాగారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్‌లకు స్పందించి ఓటిపి చెబితే బ్యాంకులో వున్న నగదు ఖాళీ అవడం ఖాయమని పోలీసులు హెచ్చరించారు. ఈ విషయంలో ఎలాంటి అనుమానం వున్నా వెంటనే పోలీసులకు లేదా 1930కి ఫోన్ చేయాలని పోలీసులు కోరారు.




డెలివరీ బాయ్ పేరిట సైబర్ నేరగాళ్లు చేసే స్కాంపై టి.పోలీసు విభాగం ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్.

# రేపటి నుంచి సిపిజిఇటి-2024 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

### ఎంఇడి, ఎంపిఇడి మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పీజీ కాలేజీల్లోని పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 28 నుంచి ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఇదే సమయంలో ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకి మొదటి ఫేజ్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నట్టు సీపీజీఈటీ-2024 ఇన్‌ఛార్జ్ కన్వీనర్ ప్రొఫెసర్ పి జలపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీజీఈటీలో అర్హత సాధించిన వారు ఈ నెల 28 నుంచి నవంబర్ 1 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నవంబర్ 1న అభ్యర్థులను దరఖాస్తులో తప్పులను సరి చేసుకోడానికి ఎడిట్ సౌకర్యం కల్పించారు. అలాగే నవంబర్ 1 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లకి అవకాశమిచ్చారు.

నవంబర్ 4న వెబ్ ఆప్షన్లకి ఎడిట్ సౌకర్యమిచ్చారు. నవంబర్ 8న సీట్ల కేటాయింపును చేపట్టనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు నవంబర్ 12లోపుగా ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని సీపీజీఈటీ-2024 ఇన్‌ఛార్జ్ కన్వీనర్ ప్రొఫెసర్ పి జలపతి తెలిపారు.

# ఆపరేషన్ ఓపెరాను తలపించిన ఇజ్రాయెల్ వైమానిక దాడులు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఇరాన్‌పై ఇజ్రాయెల్ తాజాగా నిర్వహించిన వైమానిక దాడులు 1981 నాటి ఆపరేషన్ ఓపెరాను తలపించిందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. తమ దేశ అతిథిగా విచ్చేసిన హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను ఇజ్రాయెల్ పక్కా పథకంతో బాంబు దాడితో అంతం చేయడంపై రగిలిపోయిన ఇరాన్ దీనికి ప్రతిగా ఆ దేశంపై ఇటీవలే క్షిపణులతో దాడులకు దిగడం తెలిసిందే. ఈ దాడుల తరువాత రెండు వారాలపాటు మిన్నకున్న ఇజ్రాయెల్ శనివారం ఒక్కసారిగా ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులకు దిగడం పశ్చిమాసియాలో ఉద్రిక్తలను మరింత పెంచింది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ చేబట్టిన వైమానిక దాడులు 1981 నాటి ఆపరేషన్ ఓపెరాను గుర్తు చేసిందని రక్షణరంగ నిపుణులు అంటున్నారు.

ఇంతకు ఆపరేషన్ ఓపెరా కథ ఏమిటంటే.. అప్పట్లో సాంకేతికత ఇప్పటిలా అభివృద్ధి చెందలేదు. 1981 జూన్ ఏడవ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు ఆపరేషన్ ఓపెరాను ఇజ్రాయెల్ మొదలుపెట్టింది. కేవలం రక్షణ బలగాల అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఎట్టియాన్ అనే వైమానిక స్థావరం నుంచి 14 ఫైటర్ జెట్ విమానాలు ఒక్కసారిగా టేకాఫ్ అయ్యాయి. సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో ఈ విమానాలు ఇరాన్‌లోని ఒసిరాక్ న్యూక్లియర్ రియాక్టర్‌ను ధ్వంసం చేశాయి. ఈ సమయంలో ఇరాన్ నుంచి వచ్చిన ఎదురుదాడిని తప్పించుకుని అన్ని విమానాలు చాకచక్యంగా తిరిగి ఎట్టియాన్ వైమానిక స్థావరానికి చేరాయి. అప్పట్లో ఇజ్రాయెల్ ఎఫ్16-ఎ యుద్ధ విమానాలను వినియోగించింది. అప్పట్లో ఇజ్రాయెల్ చేబట్టిన ఆపరేషన్ విషయం చివరి నిమిషం వరకు మిత్రదేశాలకు కూడా సమాచారం లేదు. ఆఖరుకు ఇజ్రాయెల్‌లో ఐదారుగురు టాప్‌కమాండర్ల వరకే ఆపరేషన్ ఓపెరా గురించి తెలుసు. కాగా అప్పట్లో దాడులకు వాడిన ఎఫ్ 16ఎ జెట్ విమానాలకు ఎస్కార్ట్‌గా ఎఫ్ 15ఏ జెట్ విమానాలను వినియోగించింది. కాగా ఎఫ్ 15, ఎఫ్16ఎ యుద్ధ విమానాలలో కొన్ని మార్పులు చేసిన ఇజ్రాయెల్ నేటికి రక్షణ అవసరాలకు వీటిని వాడుకుంటోంది. తాజా దాడిలో ఇజ్రాయెల్ వంద ఎఫ్ 35 జెట్ విమానాలను వినియోగించడం గమనార్హం. ఇరాన్ రాజధాని టెహరాన్‌లోని 20 లక్ష్యాలను ఈ విమానాలు టార్గెట్ చేసి వాటిని ధ్వంసం చేసి విజయవంతంగా వెనక్కు వచ్చాయి. శత్రుదేశం రాడార్లకు చిక్కకుండా ఆ మార్గంలో ఉన్న ఇతర దేశాలను దాటుకుని ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్ చేబట్టింది. కాగా ఇరాన్‌పై దాడుల తరువాత ఇజ్రాయెల్‌కు చెందిన ఫైటర్‌జెట్ విమానాలు తిరిగి సురక్షితంగా తమ స్థావరాలకు చేరుకున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో తాము ఇద్దరు సైనికులను కోల్పోయామని ఇరాన్ అధికారికంగా ప్రకటించింది.

# నాన్నా! ఎప్పుడొస్తావ్?

### రోడ్డెక్కిన టిజిఎస్పీ పోలీసుల భార్యాపిల్లలు

### పోలీసులా, కూలీలా అంటూ కుటుంబసభ్యుల ఆందోళన

### అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పణ

### పోలీసు కుటుంబసభ్యుల మధ్య తోపులాట

**ఇబ్రహీంపట్నం, అక్టోబరు 26, ప్రభాతవార్త:** స్వాతంత్రం వచ్చాక పోలీసులు ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. తెలంగాణవ్యాప్తంగా టిజిఎస్పీ పోలీసుల కుటుంబ సభ్యులు ఆందోళనలు చేపట్టడం హట్ టాపిక్‌గా మారింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని టిజిఎస్పి 3వ బెటాలియన్ పోలీసులు కుటుంబ సభ్యులు శనివారం సాగర్ రోడ్డుపై బైటాయించారు. ఇబ్రహీంపట్నం ఆర్టిసి బస్టాప్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. పోలీసు ఉద్యోగం చేస్తున్న తమ భర్తలతో ఇంటి పనులు, గార్డెనింగ్ పనులు చేయిస్తున్నారని ఆందోళనకు దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పోలీస్ వ్యవస్తను ఏర్పాటు చేయాలని ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నూతన పోలీస్ వ్యవస్త తీసుకరావడంతో టిజిఎస్పి పోలీసులు ఇంటికి నెల రోజులకు ఒకసారి వస్తున్నారని.. అత్యవసర సమయంలో ఇంటికి పెద్దదిక్కు పక్కన లేకపోవడంలో ఇబ్బందులకు గురవుతున్నామని టిజిఎస్పి పోలీసుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనలో స్థానిక పోలీసులకు టిజిఎస్పి పోలీసుల కుటుంబ సభ్యుల మధ్యతోపులాట జరిగింది. మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎసిపి కెపివి రాజు ఆంధోళనా కారులతో మాట్లాడి శాంతింపజేశారు. ఈ సందర్భంగ టిజిఎస్పి పోలీసుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. తమ పిల్లలు 'తండ్రిని మరచిపోయేలా ఉన్నారని.. డ్యూటీకి వెళ్తున్న తండ్రిని చూసి నాన్న మళ్ళీ ఇంటికి ఎప్పుడు వస్తావ్' అని అడుగుతుంటే కన్నీలోస్తు న్నాయంటూ అవేదన వ్యక్త చేస్తున్నారు. గతంలో 15ను రోజులకు ఒక సారి సెలవులు ఇచ్చేవారని.. నూతన పోలీసు విధానంలో నెల రోజులకు ఒకసారి సెలవులు ఇస్తున్నారని తమ కుటుంబాన్ని ఎప్పుడు చూసుకోవాలి.. ఏదైన ఆరోగ్య సమస్యలు వస్తే ఎలా అంటూ.. తమ భర్తలకు కూడ సివిల్ పోలీసులకు ఏవిధంగా డ్యూటి ఉంటదో అదే డ్యూటి ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి వినతీపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించకుంటే తమ ఆంధోళలను ఉదృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న టిజిఎస్పీ పోలీసుల కుటుంబసభ్యులు

# నేటితో ముగియనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు

### ఆరో రోజు పరీక్షకు 67 శాతం హాజరు

### నేడు పేపర్-6 తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఆవిర్భావంపై పరీక్ష

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఈ నెల 21 నుంచి రాష్ట్రంలో ప్రారంభమైన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నేటి(ఆదివారం)తో ముగియనున్నాయి. గత ఆరు రోజులుగా మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. ఈ నెల 21(సోమవారం)న క్వాలిఫైయింగ్ టెస్ట్ అయిన జనరల్ ఇంగ్లీష్ జరుగగా.. మంగళవారం పేపర్-1 జనరల్ ఎస్సే పరీక్ష జరిగింది, బుధవారం పేపర్-2 హిస్టరీ, కల్చర్ అండ్ జియోగ్రఫీ పరీక్ష జరిగింది. గురువారం పేపర్-3 ఇండియన్ సొసైటీ, కాన్‌స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్ పరీక్ష జరగగా.. శుక్రవారం పేపర్-4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్ష జరగగా శనివారం పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డాటా ఇంటర్ ప్రిటేషన్ పరీక్ష జరిగింది. మంగళవారం నుంచి సబ్జెక్టు పరీక్షలు ప్రారంభం కాగా నేటితో ముగియనున్నాయి.

సోమవారం జరిగిన క్వాలిఫైయింగ్ పరీక్ష అయిన జనరల్ ఇంగ్లీష్‌కి 31,383 మందికి గానూ 22,744 మంది(72.40 శాతం) మంది హాజరు కాగా.. ఆ తరువాత నుంచి జరిగే సబ్జెక్టు వారీ పరీక్షలకు 70 శాతంలోపు హాజరు ఉంటుంది. శుక్రవారం జరిగిన పేపర్-4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్షకు 31,383 మందికి గానూ 21,195 మంది(67.4 శాతం) హాజరయ్యారు కాగా శనివారం జరిగిన పేపర్-5 సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డాటా ఇంటర్‌ప్రిటేషన్ పరీక్షకు 67 శాతం మంది హాజరయ్యారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటిసారిగా నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతుండగా.. శుక్రవారం మాత్రం రంగారెడ్డి జిల్లాలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదయింది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రిలిమ్స్ పరీక్ష అనంతరం మెయిన్స్‌కి 31,383 మందిని ఎంపిక చేశారు. వారికి హైదరాబాద్ జిల్లాలో 8, రంగారెడ్డి జిల్లాలో 11, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 27 కలిపి... మొత్తం 46 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణ కోసం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ నెల 27తో పరీక్షలు ముగియనున్నాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష కావడంతో.. మధ్యాహ్నం 1.30 గంటలకే పరీక్షా కేంద్రం గేట్లను మూసివేస్తున్నారు. 1.30 లోపుగా వచ్చిన అభ్యర్థులను మాత్రమే పరీక్షా కేంద్రాల్లోనికి పోలీసులు అనుమతిస్తున్నారు. చివరి రోజైన 27న చివరి పరీక్ష పేపర్-6 తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పరీక్ష జరగనుంది. దీంతో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ముగియనున్నాయి.

# ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్‌పై కొనసాగుతున్న ఫిర్యాదులు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లాలో గతంలో పనిచేసి ప్రస్తుతం పశు సంవర్ధక శాఖలో వున్న ఐఎఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై ఫిర్యాదు చేసేందుకు బాధితులు బషీర్‌బాగ్ లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. శనివారం నాడు పది మందికి పైగా బాధితులతో పాటు వారి వెంట మరికొందరు వచ్చి ఈడీ అధికారులకు తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. అమోయ్ కుమార్ కలెక్టర్‌గా వున్న సమయంలో వట్టినాగులపల్లిలోని శం కర్ హిల్స్ ప్లాట్‌లో జరిగిన గోల్‌మాల్ వ్యవహారంపై ఇక్కడి ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం నాడు ఈడీ అధికారులకు సవివరంగా ఫిర్యాదు చేశారు. అప్పట్లో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని అమోయ్ కుమార్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, 200 ఎకరాలను రియల్టర్లకు అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని వారు తమ ఫిర్యాదులో తె లిపారు. తమకు అంతకు ముందే కేటాయించిన ప్లాట్లను తిరిగి ఎకరాలుగా మార్చి అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేశారని, ఈ క్రమంలో రాత్రికి రాత్రి తప్పుడు పత్రాలు సృష్టించారని బాధితులు వాపోయారు. తాము 40 ఏళ్లుగా పొజిషన్‌లో వుంటే పోలీసులతో వెళ్లగొ ట్టే ప్రయత్నం చేశారని వారు ఆరోపించారు. సర్వే నంబర్ 111 నుంచి 179 వరకు 460 ఎకరాల భూమి వుందని వీటిపై 3300 మంది ప్లాట్ యజమానులు వుంటున్నారని, దాదాపు 30 వేల కో ట్ల రూపాయల విలువైన ఈ భూములను అన్యాయంగా ఇతరులకు ధారాదత్తం చేశారని వారు వా పోయారు. ఈ గోల్‌మాల్‌లో ఒక్క అమోయ్ కుమార్ మాత్రమే నిందితుడు కాదని ఆయన వెంట మరి కొందరు పెద్దల పాత్ర వుందని, వానిపైనా విచారణ చేయాలని బాధితులు ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

# బొగ్గు గనుల సంప్రదింపుల సంఘం సభ్యుడిగా ఎంపి రవిచంద్ర

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** కేంద్ర బొగ్గు, గనుల శాఖ సంప్రదింపుల సంఘం సభ్యునిగా తెలంగాణ ఎంపి వి రవిచంద్ర నియమితులయ్యారు. ఈ సంప్రదింపుల సంఘానికి ఛైర్మన్‌గా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి వ్యవహరిస్తారు. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. కాగా రవిచంద్ర ఇప్పటికే పెట్రోలియం, సహజ వాయువు శాఖ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

# ప్రజలందరిపై వెంకన్న ఆశీస్సులుండాలి

### శ్రీవారి సేవలో ప్రముఖులు

**తిరుమల,అక్టోబర్ 26ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలకు శుభాలు కల గాలని స్వామివారిని ప్రార్థించి నట్లు ప్రముఖులు తెలిపారు. శనివారం కేంద్రమంత్రి శోభక రందలాజీ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సినీనటి ఐశ్వర్యరాజేశ్ ఉదయం తిరుమలకు చేరుకుని ఆలయంలోనికి వచ్చారు. విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో వెంకన్నను దర్శించుకుని తీర్థప్రసాదాలుఅందుకున్నారు.

# దుండిగల్‌లో భూసర్వేను అడ్డుకున్న రైతులు

### వార్డు కార్యాలయం వద్ద ఆందోళన

### పేదల జోలికొస్తే ఊరుకోం : ఎంపి ఈటల

**హైదరాబాద్ (దుండిగల్), అక్టోబరు 26, ప్రభాతవార్త:** టిజిఐఐసి కోసం ప్రభుత్వం చేపట్టిన భూసర్వేను రైతులు అడ్డుకున్నారు. యేళ్ల తరబడి ఉంటున్న స్థలాన్ని ఎలా స్వాధీనం చేసుకుంటారని మండి పడుతూ ఆందోళన చేపట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్‌లో సర్వేనంబర్ 454,453లలో 446ఎకరాల అసైన్డ్ స్థలం ఉంది. సదరు అసైన్డ్ భూమిలో గతంలో జీవనోపాధి కోసం ఒక్కో రైతుకు ఎకరంన్నర స్థలం చొప్పున అసైన్డ్‌పట్టాలను అందించింది. సదరు స్థలం నుండి ప్రభుత్వం ఇప్పటికే పిఒటి కింద 99 ఎకరాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం దుండిగల్ వార్డు కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ఇక్కడి నుంచి పోటీ చేసినప్పుడు అండగా ఉంటానని పేర్కొని నేడు ముఖ్యమంత్రి అయ్యాక తమ భూములను ఇష్టానూసారంగా లాక్కుంటాము అంటే ఊరుకోబోమన్నారు.

**పేదల జోలికి వస్తే ఊరుకోం: ఎంపి ఈటల రాజేందర్**

దుండిగల్‌లోని సర్వే నంబర్ 454, 453లలో భూసర్వేను అడ్డుకున్న రైతులు చేపట్టిన ఆందోళనకు ఎంపి ఈటల రాజేందర్ తన మద్దతు తెలిపారు. ప్రభుత్వం అలాట్ చేసిన భూములను ఎప్పుడుపడితే అప్పుడు లాక్కునే అధికారం ప్రభుత్వానికి లేద న్నారు. ప్రజా అవస రాల కోసం వాడు కోవల్సి వస్తే రైతు లకు తగిన పరిహారం చెల్లిం చాల్సి ఉంటుం దన్నా రు. కెసిఆర్ ప్రభుత్వం పేదలను ఇబ్బందులు పెడితే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే తరహాలో వ్యవరిస్తుందని తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**ఉన్నతాధి కారుల ఆదేశానుసారం చర్యలు: తహసీల్దార్ మతీన్**

సర్వే నంబర్ 454, 453లలోని 446 ఎకరాల్లో డబుల్‌బెడ్ ఇళ్లు, డంపింగ్ యార్డు, ఔటర్‌రింగు రోడ్డు కేటాయించగా మిగులు స్థలాన్ని రైతుల నుండి తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని తహసీల్దార్ మతీన్ స్పష్టం చేశారు. సదరు అసైన్డ్‌భూమి ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

# విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

### సెక్రటేరియట్ ముట్టడికి యత్నించిన ఎఐఎస్‌ఎఫ్

### అరెస్టుచేసిన పోలీసులు

**హైదరాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ.. అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్) శనివారం ఛలో సెక్రటేరియట్ నిర్వహించింది. సచివాలయంలోనికి వెళ్లడానికి ప్రయత్నించిన విద్యార్థులు, విద్యార్థినాయకులను పోలీసులు బీఆర్‌కే భవన్ దగ్గరనే అడ్డుకొని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకి తరలించారు. పోలీసులకి, విద్యార్థి సంఘం నాయకులకి మధ్య తోపులాట, వాగ్వాదంతో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం దగ్గర కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఏ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్‌తో పాటు మరికొంతమందిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఫీజు బకాయిలపై ఆనాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పింది ఒకటి.. నేడు చేస్తుంది ఏమిటనీ వారు ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యార్థుల జీవితాలో చెలగాట మాడుతుం దన్నారు. రాష్ట్రంలో ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ సుమారు రూ. 7650 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ నిధుల మూలంగా రాష్ట్రంలో 13 లక్షల మంది విద్యా ర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసిన వారు వివిధ ఎంట్రన్స్‌లలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీన ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో చేరడానికి వారికి ఒరిజినల్ సర్టిఫికెట్లు లేకపోవడంతో.. ఉన్నత విద్యను చదవలేకపోతున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఒకేసారి ఫీజు బకాయిలను విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పీసీసీ అధ్యక్షుడు నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా.. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని వారు మండిపడ్డారు. పాల కులు మారినా.. విద్యార్థుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభు త్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్‌ను విడుదల చేయాలని స్టాలిన్, మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్

**THE SINGARENI COLLIERIES COMPANY LIMITED**
(A Government Company)
Regd. Office: Kothagudem- 507101, Telangana

**E-PROCUREMENT TENDER NOTICE**

Tenders have been published for the following Services / Material Procurement through e-procurement platform. For details, please visit https://tender.telangana.gov.in - or- https://scclmines.com

| NIT/Enquiry No.-Description/Subject/Estimated Contract Value - Last date and time. |
|---|
| CRP/CVL/STPP/TN-54/2024-25 Dt.15.10.2024 - Providing Bituminous Road over reservoir bund at STPP, Jaipur (V&M), Mancherial dist, Telangana State. Rs. 2,13,08,900/- - 01.11.2024 - 04.30 P.M. |
| CRP/CVL/COR/TN-55/2024-25 dt.21.10.2024 - Repairs and Renewal coat to the existing internal BT roads at Bungalows Area, Kothagudem Corporate. Bhadradri Kothagudem District. Telangana state. Rs.2,43,29,753 - 05.11.2024 - 04.30 P.M. GM (Civil) |
| MMR/CVL/E-MM/T-51/2024-25 - M & R works to quarters at Pranahita colony, Mandamarri area for the year 2024-25, Mancherial Dist. T.S. Rs. 40,17,810/- - 02.11.2024 - 04:30 P.M. GM (MMR) |
| CW/RD/e-63/2024-25, dt.19.10.2024 - Providing roof top rainwater harvesting arrangements and other miscellaneous repair works to houses of NTR Nagar near JVROC-II, Sathupalli, Kothagudem area Phase-IV (Package-I)Under Remediation plan of JVROC-I Expansion. Rs.34,12,186/- - 05.11.2024 - 04.30 P.M. |
| CW/RD/e-64/2024-25, dt.19.10.2024_- Providing roof top rainwater harvesting arrangements and other miscellaneous repair works to houses of NTR Nagar near JVROC-II, Sathupalli, Kothagudem area Phase-IV (Package-II)Under Remediation plan of JVROC-I Expansion. Rs.33,63,532/- - 05.11.2024 -04.30 P.M. |
| CW/RD/e-65/2024-25, dt. 19.10.2024 - Providing roof top rainwater harvesting arrangements and other miscellaneous repair works to houses of NTR Nagar near JVROC-II, Sathupalli, Kothagudem area Phase-IV (Package-III)Under Remediation plan of JVROC-I Expansion. Rs.32,80,011/- - 05.11.2024 - 04.30 P.M. |
| CW/RD/e-66/2024-25, dt.19.10.2024 - Providing roof top rainwater harvesting arrangements and other miscellaneous repair works to houses of Vengalrao Nagar near JVROC-II, Sathupalli, Kothagudem area Phase-IV (Package-IV)Under Remediation plan of JVROC-I Expansion. Rs.32,60,392/- - 05.11.2024 -04.30 P.M. |
| CW/RD/e-67/2024-25, dt.19.10.2024 - Providing roof top rainwater harvesting arrangements and other miscellaneous repair works to houses of Vengalrao Nagar near JVROC-II, Sathupalli, Kothagudem area Phase-IV (Package-V)Under Remediation plan of JVROC-I Expansion. Rs.32,63,184/- - 05.11.2024 -04.30 P.M. |
| CW/RD/e-68/2024-25, dt.21.10.2024 - Construction of agricultural Godown near by sathupalli villages Kothagudem area ("Invited under earmarked work - SCCL Registered contractors belongs to SC community only are eligible to participate. Rs.30,54,508/- - 07.11.2024 - 04.30 P.M. |
| CW/RD/e-76/2024-25, dt.23.10.2024 - Construction of boundary pillars and barbed wire fencing around the mine lease area and along the diverted forest land (Rasanugudem & GKOC) for VKOC coal mine, Kothagudem area, Bhadradri Kothagudem District, Telangana State. Rs.37,31,455/- - 07.11.2024 - 04.30 P.M |
| CW/RD/e-77/2024-25, dt.23.10.2024 - Construction of boundary pillars and 1.40 m height barbed wire fencing to the diverted forest land for VKOC coal mine, Kothagudem area, Bhadradri Kothagudem District, Telangana State. Rs.48,55,024/- - 07.11.2024 - 04.30 P.M. GM KGM |
| PR/2024-25/ADVT/CVL/ MMR /KGM/54 |
| DIPR.NO. 5942-PP/CL/ADVT/1/2024-25, DT: 26/10/2024 |

